సాక్షి జగిత్యాల

ఆదివారం । 30 । జూన్ । 2024



నృసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరిలో స్నానాలు చేసి స్వామివార్లను దర్శించుకున్నారు.



'గణాంకదర్శిని' ఆవిష్కరణ

జగిత్యాల: గణాంకదర్శిని బుక్‌లెట్‌ను కలెక్టర్ సత్యప్రసాద్ కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఇందులో జిల్లా సమాచారమంతా ఉంటుందన్నారు. ముఖ్య ప్రణాళిక అధికారి పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
29.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. మరికొన్ని చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పరిశుభ్రతపై దృష్టి సారించాలి



పాఠశాలను పరిశీలిస్తున్న రఘువరన్

పెగడపల్లి: పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ రఘువరన్ అన్నారు. మండలంలోని లింగాపూర్ గ్రామాన్ని శనివారం సందర్శించారు. పలు వీధుల్లో పర్యటించిన అనంతరం మురికి కాల్వల నిర్వహణ, పాఠశాలను పరిశీలించి అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా చేపడుతున్న మరమ్మతు పనులను తనిఖీ చేశారు. అంగన్‌వాడీల సెక్టార్ సమావేశాన్ని సందర్శించి టీచర్లకు పలు సూచనలు చేశారు. మురికి కాల్వలు శుభ్రం చేయిస్తూ దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, సీజన్ వ్యాధుల నివారణకు జాగ్రతలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ శోభతిరుపతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మహేశ్వరి ఉన్నారు.

రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వాణి

జగిత్యాలఅగ్రికల్చర్: రైతు భరోసా పథకాన్ని పదెకరాల వరకు ఉన్న రైతులకు వర్తింపజేయాలని అన్నదాతలు అభిప్రాయపడ్డారు. జిల్లా కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో జిల్లా వ్యవసాయాధికారి వాణి సమక్షంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చైర్మన్ మహిపాల్‌రెడ్డి, రైతులు పలు సూచనలు చేశారు. కొందరు రైతులు ఐదెకరాల వరకే ఇవ్వాలని సూచించగా.. మరికొందరు పదెకరాల వరకూ ఇవ్వాలని సూచించారు. సాగుచేస్తున్న భూమికి మాత్రమే ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. సన్నాలతోపాటు దొడ్డురకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ శీలం సురేందర్, సీఈఓ గాజెంగి వేణు, డైరెక్టర్లు రమేశ్‌రావు, గంగారాజం, రాజవ్వ, లక్ష్మీ, దేవమ్మ, రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల బెడద

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో ట్రాన్స్‌జెండర్లు ఇబ్బంది పెడుతున్నారని ప్రయాణికులు డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. బస్‌స్టాండ్‌లో ఉన్నా.. బస్సుల్లో ఉన్నా.. ప్రయాణికులను డబ్బులు అడుగుతున్నారని, ఇవ్వకుంటే దుర్భాషలాడుతున్నారని ఫిర్యాదు చేశారు.

అక్రమాలకు చెక్ పెట్టేలా..

- రెగ్యులర్ ఉద్యోగులకే ఆస్తిపన్ను వసూలు బాధ్యత
- అమల్లోకి వచ్చిన పురపాలక శాఖ ఉత్తర్వులు
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు విముక్తి



జగిత్యాల మున్సిపాలిటీ కార్యాలయం

జగిత్యాల: మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్లలో చోటుచేసుకుంటున్న అవకతవకలకు చెక్ పెట్టేందుకు పురపాలక శాఖ సిద్ధమైంది. బల్దియాల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకే వసూలు బాధ్యతలు అప్పగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పెద్ద మున్సిపాలిటీలు. ఇందులో ఆస్తిపన్ను వసూళ్లకు సిబ్బంది తక్కువగా ఉండటంతో కొంతమంది అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించారు. అయితే ఆస్తిపన్ను విషయంలో అక్కడక్కడా అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో ప్రభుత్వం కొత్త నిబంధన తీసుకొచ్చింది. నగదు లావాదేవీల నిబంధనలకు సంబంధించి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తీసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. పౌర సేవ కేంద్రాల్లోనూ నేరుగా ఆస్తిపన్ను స్వీకరించి.. కంప్యూటర్ రశీదు ఇచ్చే విధానాన్ని తీసివేశారు. ప్రస్తుతం అన్ని మున్సిపాలిటీల్లో ఈ నిబంధనలు అమలులోకి వస్తున్నాయి. జగిత్యాల బల్దియాలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తక్కువగా ఉన్నా.. కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ ప్రాంతాల్లో కాస్త ఎక్కువగానే ఉన్నాయి.

అవకతవకలకు చెక్..

మున్సిపాలిటీల్లో ప్రతి విభాగంలో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పన్ను వసూలుతోపాటు ఇతర విభాగంలోనూ అక్రమాలు జరుగుతున్నాయన్న నేపథ్యంలో వాటికి ప్రభుత్వం చెక్‌పెట్టాలనే ఉద్దేశంతో అందులో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకే అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇంతకుపూర్వం హ్యాండ్ హెల్డ్ మిషన్స్‌లో ప్రాపర్టీ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నంబరు నమోదు చేయగానే వారికి ఎంత ఆస్తి పన్ను ఉందో వచ్చేది. దీంతో సిబ్బంది ఆ డబ్బులు తీసుకుని రశీదు ఇచ్చేవారు. అనంతరం వీరు వెళ్లి మున్సిపాలిటీ క్యాష్ కౌంటర్‌లో డబ్బులు అందించేవారు. ఇక్కడే అవకతవకలు జరిగే అవకాశం ఉండటంతో ప్రభుత్వం దీనికి చెక్‌పెట్టాలన్న ఉద్దేశంతో వారికి ఈ బాధ్యతలను తొలగిస్తూ రెగ్యులర్ ఉద్యోగులకే బాధ్యతలు అప్పగించింది. ఇక నుంచి రెగ్యులర్ ఉద్యోగులే ఆస్తిపన్ను వసూలు చేయాల్సి ఉంటుంది. జగిత్యాల బల్దియాలో ఆస్తి పన్ను రూ.12కోట్ల వరకు డిమాండ్ ఉంది. కోరుట్ల, మెట్‌పల్లిలో రూ.7కోట్లకు పైగానే ఉంది. ధర్మపురి, రాయికల్ చిన్న మున్సిపాలిటీలు కావడంతో అక్కడ రూ.రెండు నుంచి రూ.మూడు కోట్ల డిమాండ్ ఉంది.

అమల్లోకి ఉత్తర్వులు

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అమల్లోకి వచ్చాయి. సిబ్బంది లేకున్నా అందులో పనిచేస్తున్న ఎవరికైనా బాధ్యతలు అప్పగించాలని సూచించారు. కాంట్రాక్ట్‌గానీ, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం ఇవ్వొద్దని ఆదేశాలు జారీ అయ్యాయి. అవకతవకలు జరిగితే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశం లేదు. అందుకోసం రెగ్యులర్ ఉద్యోగులకే ఈ బాధ్యతలు అప్పగించారు. ఏదైనా సంఘటనలు జరిగినా వీరిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది కాబట్టి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

రెగ్యులర్ ఉద్యోగులకే బాధ్యతలు

రెగ్యులర్ ఉద్యోగులకే బాధ్యతలు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. వారికే బాధ్యతలు ఇచ్చాం. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఈ బాధ్యతల నుంచి తొలగిస్తాం. వేరే బాధ్యతలను అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– యాదగిరి, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్

తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకే



తల్లిదండ్రులను పట్టించుకోని వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు, సిబ్బంది

జగిత్యాలటౌన్: తల్లిదండ్రులను విస్మరిస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఆర్డీవో కార్యాలయం పాలనాధికారి తఫజుల్ హుస్సేన్ హెచ్చరించారు. తల్లిదండ్రుల పోషణ, రక్షణ చట్టం కింద వచ్చిన ఫిర్యాదుల మేరకు జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ ఆదేశాల మేరకు వృద్ధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కొడుకులు, కోడళ్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సారంగాపూర్ మండలం కోనాపూర్‌కు చెందిన పంగ రాజవ్వ, జగిత్యాల మండలం మోతె గ్రామానికి చెందిన పడాల గంగు, మోరపల్లికి చెందిన సంపతి గంగయ్య, బీర్‌పూర్ మండలం కమ్మునూర్‌కు చెందిన తోట భూమరాజం, గొల్లపల్లి మండలం ఇబ్రాజీపల్లికి చెందిన సంకటి రాజవ్వ ఫిర్యాదు మేరకు వారి వారసులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రులను విస్మరిస్తే మూడునెలల జైలు శిక్ష విధించనున్నట్లు వెల్లడించారు. సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, సెక్షన్ సహాయకులు పద్మజ, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ కొండయ్య పాల్గొన్నారు.

హాస్టళ్ల తనిఖీ



ప్రైవేటు స్కూల్ హాస్టల్‌లో సరుకులను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష

జగిత్యాల: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల, పలు రెసిడెన్షియల్ హాస్టల్స్, ప్రైవేటు పాఠశాలల హాస్టళ్లలో తనిఖీ చేసి నాణ్యమైన భోజనం ఉందా..? సరుకులు తాజావా..? కాదా..? పరిశీలించారు. కొన్ని హాస్టళ్లలో పురుగులు పట్టిన బియ్యం, చింతపండు, పిండి ఉండటంతో నోటీసులు జారీ చేశారు. నాణ్యమైన భోజనం పెట్టకుంటే కేసులు నమోదు చేస్తామని అనూష హెచ్చరించారు.

అంజన్న మహిమగల దేవుడు



అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్‌కల్యాణ్

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ఆలయంలో స్వామివారికి పూజలు
- టీటీడీ నిధులతో 100 గదులు, మండపానికి అధికారుల వినతి

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు మహిమ గల దేవుడని జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ అన్నారు. శనివారం కొండగట్టు అంజన్న ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న పవన్‌కు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదం అందించారు. అభిమానులు పెద్ద ఎత్తున గుట్టపైకి తరలివచ్చారు. ఆయనకు హనుమాన్ గద, పవన్ చిత్రపటాన్ని బహూకరించారు. టీటీడీ నిధులతో భక్తుల కోసం 100 గదులు, రెండువేల మందికి సరిపడా దీక్ష మండపాన్ని నిర్మించాలని ఆలయ అధికారులు పవన్‌కు వినతిపత్రం అందించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, ఈవో చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, ఏఈఓ అంజయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస్ శర్మ, ప్రధాన అర్చకుడు జితేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



పవన్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో చంద్రశేఖర్, ఏఈవో అంజయ్య, పూజారి

యావర్‌రోడ్ వెడల్పునకు చర్యలు

- మౌలిక వసతులకు నిధులు మంజూరు
- కలెక్టర్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వినతి



కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని యావర్‌రోడ్‌ను అన్నపూర్ణ చౌరస్తా నుంచి కొత్తబస్టాండ్ వరకు వెడల్పు చేయాల్సి ఉందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డివిజన్ కేంద్రంగా ఉన్నప్పుడు 40 ఫీట్ల రోడ్డు ఉండేదని, 1994లో అప్పటి పరిస్థితుల దృష్ట్యా 60ఫీట్లకు విస్తరించామని, ప్రస్తుతం ట్రాఫిక్ పెరిగిన దృష్ట్యా వంద ఫీట్లకు పెంచాల్సిన అవసరముందని పేర్కొన్నారు. 2016–17లో అప్పటి మున్సిపల్ పాలకవర్గం తీర్మానించి డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్‌కు పంపించిందని, ప్రజాభిప్రాయం సేకరించి మార్కింగ్ ఇచ్చినా అప్పటి టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆపిందని పేర్కొన్నారు. ప్రస్తుతం యావర్‌రోడ్‌ను 100 ఫీట్లు చేయాలని నిర్ణయించామన్నారు. రూ.50కోట్ల వరకు బాధితులకు పరిహారం చెల్లించాల్సి వస్తుందని, విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ఆశించిన స్థాయిలో తాగునీరు అందడం లేదన్నారు. డబ్బా నుంచి నీరు వస్తున్నా.. క్లోరినేషన్ కావడం లేదన్నారు. తాజాగా ప్రతి ఇంటికీ నీరందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.27.95 కోట్లు విడుదల చేసిందని, దీని ద్వారా ధర్మసముద్రం నుంచి సంప్, ఫిల్టర్ బెడ్ మరమ్మతు, నూతన పైప్‌లైన్ వేస్తామని పేర్కొన్నారు. గొల్లపల్లి శ్మశాన వాటిక నుంచి ధర్మపురి రోడ్ వరకు బైపాస్ రోడ్ విస్తరణకు రూ.14 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులన్నీ పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు కలెక్టర్‌కు వినతి

బల్దియా మాస్టర్ ప్లాన్ అమలు, యావర్‌రోడ్‌ను 100 ఫీట్ల విస్తరణకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వినతిపత్రం అందించారు.

డీఎస్ మృతి బాధాకరం: ఎమ్మెల్సీ

జగిత్యాల: పీసీసీ అధ్యక్షుడిగా.. మంత్రిగా ప్రధాన భూమిక పోషించిన ధర్మపురి శ్రీనివాస్ మృతి తీరని లోటు అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. విద్యార్థి దశలో ఎన్ఎస్‌యూఐ యువజన కాంగ్రెస్ నాయకుడిగా.. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఉద్యమ సమయంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన లోకాన్ని వీడడం బాధాకరమన్నారు.

పరిశుభ్రత సామాజిక బాధ్యత



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మల్యాల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎన్.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తక్కళ్లపల్లి జెడ్పీ పాఠశాలను శనివారం పరిశీలించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పాటించాల్సిన నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ముందుగా తక్కళ్లపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట వైద్యురాలు మౌనిక, ఆరోగ్య సిబ్బంది మురళి, శ్రీధర్, వంశీ, ప్రార్థన, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..

సారంగాపూర్: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రంగపేటలో పర్యటించారు. ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మండల వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

కొండగట్టుకు చేరిన శ్రీరాముడి ధనస్సు



బంగారం, వెండితో తయారు చేసిన ధనస్సు

జగిత్యాలటౌన్/కొండగట్టు: వెండి, బంగారంతో అయోధ్య రాముడి కోసం నిజామాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రీ తయారు చేయించిన ధనస్సు శనివారం జగిత్యాలకు చేరింది. ధనస్సుకు జిల్లాకేంద్రంలోని కోదండ రామాలయంలో మాతలు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా శోభాయాత్ర చేపట్టారు. కంచి శృంగేరిపీఠంతోపాటు శ్రీరాముడు వనవాసంలోకి వెళ్లిన పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు చేసిన ఈ ధనస్సును అయోధ్యలోని శ్రీరామమందిరంలో సమర్పించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ నాయకులు తెలిపారు. భారత్ సురక్షాసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్.రాజు, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్, సహ కార్యదర్శి గాజోజు సంతోష్ పాల్గొన్నారు. అనంతరం ధనస్సును కొండగట్టు అంజన్న సన్నిధికి తీసుకెళ్లారు. ఈవో చంద్ర శేఖర్, ప్రధాన అర్చకులు జితేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోరులేని మూటపల్లి



'సహజ వనరులు ఏవైనా అవసరం మేరకు వాడితే కలకాలం ఉంటాయి. ఇష్టారీతిన వినియోగిస్తే దుష్ప్రభావాలు తప్పవు. ఇది గ్రహించిన మూటపల్లివాసులు ఒక తీర్మానం చేసుకున్నారు. భూగర్భజలాలను వ్యవసాయానికి బావుల ద్వారానే వినియోగించాలనుకొని, దాన్ని ఇప్పటికీ పాటిస్తున్నారు. దీంతో సాగు భూముల వద్ద ఒక్క బోరు కనిపించదు. ఫలితంగా వ్యవసాయ బావులన్నీ నిండుకుండను తలపిస్తున్నాయి. రైతులు ఏడాదికి రెండు పంటలు పండిస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు.'

– 8వ పేజీలో

క్లుప్తంగా

చెన్నైలో మడిపల్లివాసి దుర్మరణం


సయ్యద్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): చెన్నైలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ సయ్యద్ (30) మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. ఎండీ.జలీల్–మున్నా దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కూమారుడు సయ్యద్ డిగ్రీ వరకు చదువుకున్నాడు. హనుమకొండ లారీ ట్రాన్స్‌పోర్టు పరిధిలో లారీడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై పట్టణానికి శుక్రవారం లోడ్‌తో వెళ్లాడు. అక్కడ ఓ చెక్‌పోస్ట్ వద్ద దిగాడు. పర్మిట్ కాగితాలు చూపించేందుకు వెళ్తుండగా వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనతో మడిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆశావర్కర్ ఆత్మహత్య

- భర్త వేధింపులు తాళలేకే అఘాయిత్యం


రుచిత (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని తాండ్ర్యాలకు చెందిన ఆశావర్కర్ బాల్కె రుచిత (32) భర్త వేధింపులు తాళలేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లికి చెందిన రుచితకు తాండ్ర్యాలకి చెందిన బాల్కె విజయ్‌తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి పదేళ్ల కుమారుడు ఉన్నారు. కొద్దిరోజులుగా రుచితను విజయ్ అనుమానిస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడు. వేధింపులు తీవ్రం కావడంతో మనస్తాపానికి గురై, తన ఇంట్లో ఉరేసుకుంది. రుచిత తల్లి గుమ్మడి గంగు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

రాజన్న కోడెలు మృత్యువాత


రాజన్న గోశాలలో చనిపోయిన కోడె

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని కోడెలు అనారోగ్యంతో మృత్యువాత పడుతున్నాయి. శనివారం ఉదయం 6 కోడెలు చనిపోవడంతో సంకెపల్లి శివారులోని మూలవాగులో ఖననం చేసినట్లు తెలిసింది. మరిన్ని కోడెలు అనారోగ్యంతో ఉన్నట్లు సమాచారం. పరిమితికి మించి కోడెలు ఉండడంతోనే తొక్కిసలాట జరిగి, వసతులు సరిపోక అనారోగ్యం బారినపడుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.


మూటపల్లి గ్రామం


నిండుకుండను తలపిస్తున్న వ్యవసాయ బావి

బోరు లేని మూటపల్లి

- బావుల ద్వారానే వ్యవసాయం
- భూగర్భజలాలు అడుగంటొద్దని 25 ఏళ్ల క్రితం తీర్మానం
- నేటికీ పాటిస్తున్న గ్రామ రైతులు
- ఇక్కడి భూములు కొనాలనుకునే బయటి వ్యక్తులకూ ఇది వర్తింపు
- నిండుకుండను తలపిస్తున్న బావులు
- ఏడాదికి రెండు పంటలతో మంచి దిగుబడులు

రాయికల్(జగిత్యాల): వ్యవసాయం చేయాలంటే తక్కువ భూమి ఉన్న రైతులు కూడా సాగునీటికి బోర్లపైన ఆధారపడే పరిస్థితి ఉంది. కానీ, ఆ గ్రామంలో చిన్న, సన్నకారు రైతులైనా, పెద్ద భూస్వాములైనా పంటలు పండించాలంటే తప్పనిసరిగా బావిని తవ్వించాల్సిందే. 25 ఏళ్ల క్రితం చేసుకున్న తీర్మానమే నేటి వరకు అమలు చేస్తూ గ్రామంలో వ్యవసాయ బావుల ద్వారానే పంటలు సాగు చేస్తున్నారు జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని మూటపల్లివాసులు. వారిపై 'సాక్షి' స్పెషల్ స్టోరీ.

1,400 ఎకరాల్లో వివిధ పంటలు


మూటపల్లి గ్రామంలో 1,810 మంది జనాభా, 1,400 ఎకరాల సాగు విస్తీర్ణం ఉన్నాయి. 700 ఎకరాల్లో మామిడి, 80 ఎకరాల్లో మొక్కజొన్న, 40 ఎకరాల్లో పసుపు, 12 ఎకరాల్లో ఆయిల్‌పాం, 568 ఎకరాల్లో వరి పండిస్తున్నారు. ఈ గ్రామంలో 492 గృహాలున్నాయి. కేవలం 10 ఇళ్లలో మాత్రమే తాగునీటి కోసం బావిని తవ్వుకోలేని పరిస్థితుల్లో బోరు వేసుకున్నారు.

భూగర్భజలాలు అడుగంటొద్దనే..

25 ఏళ్ల క్రితం మూటపల్లిలో సాగు, తాగునీటి


ఆయిల్‌పాం సాగు..

కొరత ఏర్పడింది. భవిష్యత్‌లో భూగర్భజలాలు అడుగంటొద్దనే ఉద్దేశంతో నాటి రైతులు కొంతమంది గ్రామ నాయకులతో కలిసి మన గ్రామంలో వ్యవసాయం చేయాలంటే తప్పనిసరిగా పొలంలో బావి తవ్వించాలని, బోర్లు వేయొద్దని తీర్మానం చేశారు. ఇప్పటివరకు దాన్ని అమలు చేస్తున్నారు. మూటపల్లిలో ఇతర గ్రామాల వ్యక్తులెవరైనా వ్యవసాయ భూమి కొనుగోలు చేయాలనుకుంటే ముందుగానే ఈ తీర్మానం గురించి వివరించి, భూమి విక్రయిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా రైతు దీన్ని అతిక్రమించి, బోరు వేస్తే గ్రామస్తులంతా అతని వద్దకు వెళ్లి, బోరును మూయిస్తున్నారు.


మామిడి తోట

1 హెచ్‌పీ మోటార్లే వినియోగం..

మూటపల్లి గ్రామంలో కోళ్ల పరిశ్రమ, పశు పోషణ కోసం 1 హెచ్‌పీ మోటార్లు మాత్రమే వినియోగిస్తున్నారు. ఎవరైనా ఆ నీటిని వ్యవసాయానికి వాడితే సంబంధిత రైతుకు భారీ జరిమానా విధిస్తున్నారు. భూగర్భజలాల సంరక్షణకు ఈ గ్రామస్తులు కలిసికట్టుగా తీసుకుంటున్న చర్యలను చూసి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హ్యాట్సాఫ్ అంటున్నారు.

సండే స్పెషల్

బోర్లు వేయడం లేదు..



మా గ్రామంలో రైతులు, యువకులు నాటి పెద్దల తీర్మానాన్ని పాటిస్తూ వ్యవసాయ భూముల వద్ద బోర్లు వేయడం లేదు. ఇక్కడి ఏ రైతు భూమిని బయటి వ్యక్తులు కొనుగోలు చేసినా తీర్మానాన్ని ముందుగానే వివరిస్తున్నాం.
– బిక్కం తిరుపతి, మాజీ సర్పంచ్

తీర్మానం అభినందనీయం



మూటపల్లిలో బోర్లు వేసుకోవద్దని తీర్మానం చేయడం అభినందనీయం. దాన్ని ఇప్పటికీ అనుసరించడంతో భూగర్భజలాలు అడుగంటిపోవడం లేదు. ఈ రైతులను మిగతా గ్రామాల రైతులు ఆదర్శంగా తీసుకోవాలి.
– ముక్తేశ్వర్, వ్యవసాయాధికారి, రాయికల్

నీటి సమస్య లేదు



మా గ్రామంలో రైతులందరం వ్యవసాయ బావుల ఆధారంగానే పంటలు సాగు చేస్తున్నాం. ఏ కాలంలోనూ మాకు నీటి సమస్య ఏర్పడలేదు. నేను మామిడి, మొక్కజొన్న, పసుపు పంటలు పండిస్తున్నాను.
– తోట రాజిరెడ్డి, రైతు

కరువును అధిగమిస్తున్నాం



మా గ్రామంలో భూగర్భజలాలు అడుగంటిపోవద్దనే ఉద్దేశంతో చిన్న, సన్నకారు రైతులతోపాటు భూస్వాములు సైతం వ్యవసాయ బావుల ద్వారానే పంటలకు సాగు నీరందిస్తున్నాం. కరువును అధిగమిస్తున్నాం.
– మండ రమేశ్, రైతు

యువ రైతులూ ఆచరిస్తున్నారు



25 ఏళ్ల క్రితం వ్యవసాయం కోసం బోర్లు వేయవద్దని గ్రామ పెద్దలు తీర్మానం చేశారు. దాన్ని ఇప్పటి యువ రైతులూ ఆచరిస్తున్నారు. గ్రామంలో ఎలాంటి నీటి కొరత లేకుండా ప్రతీ సెంటు భూమి సాగవుతోంది.
– రాజేశంగౌడ్, మాజీ సర్పంచ్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


గోవర్దన్ రెడ్డి (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. బాధిత కుటుంబసభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలంలోని పద్మనగర్‌కు చెందిన కొట్గాల లచ్చిరెడ్డి–ప్రమీల దంపతులకు ఇద్దరు కుమారులు మాధవ రెడ్డి, గోవర్దన్ రెడ్డి(30) ఉన్నారు. వీరు తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సాయం చేస్తున్నారు. ఈ క్రమంలో చిన్న కొడుకు గోవర్దన్ రెడ్డి శుక్రవారం రాత్రి తమ ఇంటి పైఅంతస్తు గదిలో, మిగతా కుటుంబసభ్యులు కింది గదుల్లో నిద్రించారు. శనివారం ఉదయం లచ్చిరెడ్డి, ప్రమీల, మాధవ రెడ్డి జిల్లెల్ల శివారులోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి, పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయ పనులకు వచ్చినవారికి భోజనం తీసుకువచ్చేందుకు ప్రమీల ఇంటికి చేరుకుంది. చిన్న కొడుకును నిద్రలేపేందుకు అతడి గది వద్దకు వెళ్లింది. ఎన్నిసార్లు పిలిచినా స్పందన లేకపోవడంతో భర్తకు, పెద్ద కొడుకుకు ఫోన్ చేసి, చెప్పింది. మాధవ రెడ్డి ఇంటికి చేరుకొని, చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులు బద్దలుకొట్టి చూడగా.. గోవర్దన్ రెడ్డి బెడ్ పక్కన నేలపై బోర్లాపడి, చనిపోయి కనిపించాడు. అతని మృతికి గల కారణాలు తెలియలేదు. మృతుడి తండ్రి లచ్చిరెడ్డి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

బాత్‌రూంలో బతుకమ్మ చీరలు


మున్సిపల్ కార్యాలయ బాత్‌రూంలో చీరలు

వేములవాడ: గత ప్రభుత్వం ఏటా బతుకమ్మ పండుగకు మహిళలకు చీరలు పంపిణీ చేసింది. అయితే, గతేడాదికి సంబంధించిన చీరలను వేములవాడ మున్సిపల్ అధికారులు పంచకుండా బాత్‌రూంలో భద్రపరిచారు. శనివారం మున్సిపల్ సమావేశం అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బతుకమ్మ చీరలను ఎందుకిలా బాత్‌రూమ్‌లో దాచాల్సి వచ్చిందని కమిషనర్ అన్వేశ్‌ను ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ కారణంగా పంచలేకపోయామని, ఏటా మిగిలిన చీరలను ప్రభుత్వానికి తిరిగి పంపిస్తామని ఆయన బదులిచ్చారు. పేదలకు పంచాల్సిన చీరలను బాత్‌రూంలో ఉంచడంలో ఉద్దేశమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఉద్యోగ బదిలీ చేయిస్తానని మోసం

- రూ.7.40 లక్షలు తీసుకున్న వ్యక్తిపై కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): ఉద్యోగ బదిలీ చేయిస్తానని డబ్బులు తీసుకొని, మోసం చేసిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణానికి చెందిన రెడ్డి రుద్రమదేవి వావిలాల పీహెచ్‌సీలో పీహెచ్‌ఎంగా విధులు నిర్వహించేవారు. 317 జీవోలో భాగంగా కామారెడ్డి జిల్లా మాచారెడ్డి పీహెచ్‌సీకి బదిలీపై వెళ్లారు. అయితే, హనుమకొండకు చెందిన ధర్మేందర్ తాను గతంలో చాలా మందిని వారు ఇంతకుముందు పని చేసిన చోటుకే తిరిగి ట్రాన్స్‌ఫర్ చేయించానని నమ్మించాడు. ఆమె భర్త శంకర్‌రెడ్డి వద్ద యూపీఐ పేమెంట్ ద్వారా రూ.7.40 లక్షలు తీసుకున్నాడు. ఏడాది గడిచినా బదిలీ చేయించకపోగా ఫోన్ చేసి, బెదిరింపులకు పాల్పడుతున్నాడు. డబ్బులు తీసుకొని, చీటింగ్ చేసిన ధర్మేందర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బాధితురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

సమైక్య సాహితీ పురస్కారాలు ప్రదానం


అవార్డులు అందించిన పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, కవులు

కరీంనగర్ కల్చరల్: సమైక్య సాహితీ విశిష్ట పురస్కారాలను శనివారం కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో అందజేశారు. పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ హుస్నాబాద్‌కు చెందిన ఆయన తండ్రి ఆచార్య రజనీశ్రీ పేరిట పేరిణి నృత్య కళాకారుడు ప్రకాశ్‌కు, కరీంనగర్‌కు చెందిన కేఎస్.అనంతాచార్య తన తండ్రి కలకుంట్ల సంపత్ కుమారాచార్యులు పేరిట సంగీత గురువు రామాచారికి, ఆదర్శ ఉపాధ్యాయుడు మాడిశెట్టి మల్లయ్య పేరిట ఆయన కుమారుడు మాడిశెట్టి గోపాల్ రచయిత, ఉత్తమ ఉపాధ్యాయుడు గాజుల రవీందర్‌కు, కవి రావికంటి రామయ్య గుప్త పేరిట ఆయన కుమారుడు రావికంటి శ్రీనివాస్ ప్రముఖ పద్యకవి, అవధాని ముద్దు రాజయ్యకు అవార్డు ప్రదానం చేశారు. డాక్టర్ నాగభూషణం పేరిట ఆయన కుమారుడు డాక్టర్ రఘురామన్ తెలంగాణ నవ చరిత్ర పరిశోధకుడు విద్యావనపల్లి సత్యనారాయణకు అవార్డు అందించారు. వారికి మెమొంటోలు, రూ.5,116 చొప్పున నగదు పురస్కారం అందించి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కవులు అన్నవరం దేవేందర్, నందిని శ్రీనివాస్, బీఎస్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉపసర్పంచ్‌పై కేసు

పెద్దపల్లిరూరల్: దూషిస్తూ, చంపుతానని బెదిరించిన మాజీ ఉపసర్పంచ్‌పై కేసు నమోదు చేసినట్లు బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలం అప్పన్నపేటకు చెందిన నీలి స్వప్న ఇంటిని ఆనుకొని ఉన్న స్థలంలోని హద్దురాళ్లను శుక్రవారం మాజీ సర్పంచ్ చీకటి పోచాలు తొలగించారు. స్వప్న ఈ విషయమై ప్రశ్నించడంతో ఆయన దూషించి, చంపుతానన్నాడు. స్థలం ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తుంటే అడిగినందుకు బెదిరించాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వృద్ధుడి బలవన్మరణం

మల్యాల(చొప్పదండి): మండలంలోని రామన్నపేటకు చెందిన ఎడెల్లి గంగయ్య(75) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గంగయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం రామన్నపేట శివారులోని వరద కాలువ సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పాటే ప్రాణం.. దక్కిన విజయం

- కష్టాల కడలిని దాటి.. సింగర్‌గా ఎదిగాడు
- తెలుగు ఇండియన్ ఐడల్ షోకు రాష్ట్రం నుంచి ఎంపికైన ఒకే ఒక్కడు..
- లింగన్నపేట యువకుడి ప్రతిభ


పాట పాడుతున్న మారుతి

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలంలోని లింగన్నపేటకు చెందిన కొడుమోజు మారుతి పాటలు పాడటంపై మక్కువ పెంచుకున్నాడు. పాట కోసం పల్లె వదిలి పట్నం చేరాడు. చేతిలో చిల్లిగవ్వలేదు. హోటళ్లు, రెస్టారెంట్లలో పనిచేసేవాడు. కొన్ని సందర్భాల్లో పస్తులుండేవాడు. అయినా, చెదరని ఆత్మవిశ్వాసంతో పాట పాడే అవకాశం కోసం వెతికేవాడు. టీవీల్లో వచ్చే ప్రతీ రియాల్టీ షోను శ్రద్ధగా చూసేవాడు. ఈటీవీ పాడుతా తీయగా ప్రోగ్రాంలో సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం గాయకులకు ఇచ్చే సూచనలు, సలహాలను పాటించేవాడు. ఎలాంటి శిక్షణ లేకుండా సొంతంగా పాటలు ప్రాక్టీస్ చేసేవాడు.

ఎస్పీ బాలసుబ్రమణ్యం చెంతకు..

మారుతి పాటలు విన్న స్నేహితుడొకరు అతన్ని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వద్దకు తీసుకెళ్లాడు. మారుతిలో ఉన్న టాలెంట్, సింగర్ కావాలనే కోరికను గమనించిన ఆయన సంగీతంలో కొన్ని బేసిక్స్ నేర్పించారు.

కష్టంలోనూ పాట కోసమే..

మారుతి ఉదయం మ్యూజిక్ పాఠాలు, మధ్యాహ్నం కార్పెంటర్ వర్క్, సాయంత్రం రెస్టారెంట్‌లో పనిచేస్తూ కష్టాల కడలిని దాటి, ఓ ఆర్కెస్ట్రా గ్రూప్‌లో చేరాడు. అక్కడ మ్యూజిక్ మెటీరియల్ మోసే వాడు. ఆ గ్రూపువారు అప్పుడప్పుడు అతనితో పాడించేవారు. ఇలా ప్రతీ అవకాశాన్ని అందిపుచ్చుకొని, ప్రస్తుతం మంచి సింగర్‌గా ఎదిగాడు.


తెలుగు ఇండియన్ ఐడల్ షోలో మారుతికి స్వీట్ తినిపిస్తున్న న్యాయనిర్ణేత (ఫైల్)

రాష్ట్రం నుంచి ఒక్కడే..

ప్రపంచానికి మంచి సింగర్స్‌ను పరిచయం చేయాలని ఆహా 2022లో ఓటీటీలో టెలికాస్ట్ చేసిన తెలుగు ఇండియన్ ఐడల్ పాటల పోటీలకు మన రాష్ట్రం నుంచి మారుతి ఒక్కడికే అవకాశం లభించింది. అక్కడ అత్యంత ప్రతిభ కనబర్చి, న్యాయనిర్ణేతలచే ప్రశంసలు అందుకున్నాడు. బలగం, రజాకార్ వంటి సినిమాల్లో కోరస్ సింగర్‌గా పని చేశాడు. అనేక చిన్న సినిమాల్లో పాటలు పాడి, మెప్పించాడు. ప్రస్తుతం ఓ టీవీ చానల్‌లో ప్రసారమవుతున్న గౌరమ్మ, మల్లెమాల సీరియల్స్ టైటిల్ సాంగ్స్ మారుతికి మంచి పేరు తెచ్చి పెట్టాయి. బోల్ బేబీ బోల్ కార్యక్రమంలో బెస్ట్ పెర్ఫార్మర్ ఆఫ్ ది డే అవార్డు అందుకున్నాడు. దేశవిదేశాల్లో స్టేజీ షోలపై పాడుతూ ఉర్రూతలుగిస్తున్నాడు. కడు పేదరికం అనుభవం నుంచి ప్రస్తుతం ప్రముఖ సింగర్‌గా పేరు తెచ్చుకున్న మారుతిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. భవిష్యత్ అవకాశాలనూ అందిపుచ్చుకుంటూ మరిన్ని పాటలు పాడతానని 'సాక్షి'కి తెలిపాడు.

ట్రేడ్ లైసెన్స్ కోసం తప్పుడు వివరాలు

కోల్‌సిటీ(రామగుండం): నగరపాలక సంస్థలో కొందరు వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ పొందడం కోసం తప్పుడు వివరాలు ఇస్తూ.. అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. శనివారం అధికారులు జరిపిన క్షేత్రస్థాయి పరిశీలనలో ఇలాంటి మోసమే బహిర్గతం కావడంతో సదరు వ్యాపారికి తెలంగాణ మున్సిపల్ చట్టం–2019 ప్రకారం నిర్ణీత రుసుముకు 25 రెట్ల జరిమానా(రూ.13,500) విధించారు. అధికారుల కథనం ప్రకారం.. గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీలోని ఓ నివాస గృహంలో పుస్తకాలు నిల్వ చేసి, శ్రీ స్టూడెంట్ బుక్ పాయింట్ పేరిట విక్రయాలు జరుపుతున్నారు. నిర్వాహకులు మీ సేవలో డీఅండ్‌వో లైసెన్స్ కోసం రామగుండం నగరపాలక సంస్థకు దరఖాస్తు సమర్పించారు.


జరిమానా విధిస్తున్న హెల్త్ అసిస్టెంట్ కిరణ్

దీనిపై హెల్త్ అసిస్టెంట్ కిరణ్, శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, బుక్‌స్టాల్ నిర్వాహకులు లైసెన్స్ కోసం ఆన్‌లైన్‌లో తప్పుడు కొలతలు నమోదు చేసినట్లు గుర్తించారు. వారికి జరిమానా విధించారు.

నాచుపల్లి వద్ద ముగ్గురు దొంగల అరెస్టు



దొంగల అరెస్టు చూపుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

- ఓ జువెల్లరీ షాపు యజమాని కూడా..
- పరారీలో మరో ఇద్దరు
- 260 గ్రాముల బంగారు ఆభరణాలు, కారు, 3 విద్యుత్ మోటార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్


స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, ఫోన్లు, విద్యుత్ మోటార్లు

జగిత్యాల క్రైం: ముగ్గురు దొంగలతోపాటు వారి వద్ద ఆభరణాలు కొనుగోలు చేసిన ఓ జువెల్లరీ షాపు యజమానిని అరెస్ట చేసినట్లు జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీఆర్‌నగర్‌కు చెందిన వనం రాము, జగన్నాథం అభియ, జగన్నాథం మీనయ్య, మరో ఇద్దరు కలిసి జగిత్యాల జిల్లాలో 11 చోరీలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో కొడిమ్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాచుపల్లి వద్ద రాము, అభియ, మీనయ్యలతోపాటు వారి వద్ద ఆభరణాలను కొనుగోలు చేసిన జగిత్యాలకు చెందిన సిద్దార్థ జువెల్లరీ షాపు యజమాని గంగాధర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. అరెస్టయిన వారి వద్ద నుంచి 260 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక కారు, 3 విద్యుత్ మోటార్లు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. వనం రాముపై ఆంధ్రప్రదేశ్‌తోపాటు, ములుగు, వరంగల్, భూపాలపల్లి జిల్లాల్లోనూ దొంగతనం కేసులున్నాయని పేర్కొన్నారు. దొంగలను పట్టుకున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్, హెడ్‌కానిస్టేబుళ్లు రాజు, రాజయ్య, సౌందర్య, కానిస్టేబుళ్లు తిరుమల్, చంద్రశేఖర్, వినోద్, రాజు, సాగర్, శ్రీకాంత్, రాకేశ్, కల్యాణ్, స్వప్న, కల్యాణి, సీడీఆర్ సెల్ సిబ్బంది రాజశేఖర్, మహేశ్, మల్లేశ్‌లను ఆయన అభినందించారు.

కోరుట్ల అల్లుడు డీఎస్

- ఎంపీ అర్వింద్ పుట్టింది ఇక్కడే
- జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటున్న స్థానికులు


కోరుట్లలోని డి.శ్రీనివాస్ అత్తగారిల్లు

కోరుట్ల: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షులుగా రెండు సార్లు పనిచేసి.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తనవంతు కృషి చేసిన నేత ధర్మపురి శ్రీనివాస్ జగిత్యాల జిల్లా కోరుట్ల అల్లుడే. రాజకీయాల్లో కీలక నేతగా.. బిజీబిజీగా గడిపిన డీఎస్.. కోరుట్లకు వచ్చిన సందర్భాలు తక్కువే అయినా స్థానికులు మాత్రం ఆయనను కోరుట్ల అల్లుడని గొప్పగా చెప్పుకుంటారు. ప్రస్తుత నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరుట్లలో జన్మించడం గమనార్హం. ఇటీవల కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ధర్మపురి అర్వింద్ పోటీ చేసిన సందర్భంలో ఎంపీ అర్వింద్ ఈ విషయాన్ని పలుమార్లు గుర్తు చేశారు. అనేక సార్లు కోరుట్లలోని తన అమ్మమ్మ ఇంటిని సందర్శించి తాను చిన్నప్పుడు కాలం గడిపిన రోజులను గుర్తు చేసుకుని చుట్టుపక్కల వారితో ఆప్యాయంగా మాట్లాడారు.

1972లో వివాహం

నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌కు చెందిన ధర్మపురి శ్రీనివాస్‌కు కోరుట్లకు చెందిన రేగుల కాశీరాం, గంగమ్మ దంపతుల కుమార్తె విజయలక్ష్మీతో 1972 ఫిబ్రవరి 2వ తేదీన వివాహమైంది. పెళ్లి సమయంలో డీఎస్ హైదరాబాద్ రిజర్వ్ బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేశారు. పదేళ్లపాటు బ్యాంక్ ఉద్యోగిగా పని చేసిన ఆయన వరుసకు మేనమామ అయిన అప్పటి ఏపీ ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన అర్గుల్ రాజారాంకు అనుచరుడిగా రాజకీయప్రవేశం చేశారు. ఆ సమయంలో ఎన్ఎస్‌యూఐ స్టేట్ ప్రెసిడెంట్‌గా డీఎస్ పనిచేశారు. అనంతరం ఎమ్మెల్యేగా.. మంత్రిగా.. పీసీసీ అధ్యక్షుడిగా రాజకీయాల్లో బిజీ కావడంతో ఆయన కోరుట్లకు వచ్చిపోవడం తక్కువైంది. ఒకటి రెండుసార్లు కోరుట్ల కాపుసంఘాల నేతలు సమావేశాలకు ఆయనను అతిథిగా పిలుచుకున్న సందర్భాలు ఉన్నాయి. డీఎస్ మృతి వార్త తెలుసుకుని ఆయన బంధువు రేగుల భూమానందం మాట్లాడుతూ కోరుట్లకు వచ్చిన ప్రతిసారి బంధువులు, అత్తగారింటి చుట్టుపక్కల వారిని అందరిని ఆప్యాయంగా, ఆత్మీయంగా పలకరించేవారని గుర్తు చేసుకున్నారు. కోరుట్ల నుంచి డీఎస్ వద్దకు ఎవరు వెళ్లినా పనులు చేసిపెట్టేవారని తెలిపారు.

అర్వింద్ పుట్టింది కోరుట్లలోనే..

డీఎస్ రెండో కుమారుడు, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ 1976లో కోరుట్లలోనే జన్మించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అర్వింద్ కోరుట్ల అసెంబ్లీలో పోటీ చేయడానికి కారణం.. తన పుట్టిన ఊరు కావడమేనని చెప్పారు. ఎన్నికల సమయంలో అమ్మమ్మ విజయలక్ష్మీకి పరిచయం ఉన్నవారందరినీ ఆయన కలిసి మాట్లాడారు.